క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



సీతారామపురం : మండలంలోని పోలంగారి పల్లి, బసినేనిపల్లి, ఏపీనగర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షాను గురువారం తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు పోషకాహారం అందజేయాలని సూచించారు. అంగన్‌వాడీలు సులోచన,సంపూర్ణ, హుస్సేన్‌బీ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన



దుత్తలూరు: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దుత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి వనజ సూచించారు. జాతీయ డెంగీ మాసోత్సవాల్లో భాగంగా సోమలరేగడ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో కీటక జనిత వ్యాధులపై గురువారం అవగాహన కల్పించారు. దోమలతో డెంగీ, మలేరియా, బోధకాలు వంటి వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. దోమల నివారణకు ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని సూచించారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు

సీతారామపురం : మండలంలోని సీతారామపురం, బసినేనిపల్లి గ్రామాల్లోని పెట్రోల్ బంకులను తూనికలుకొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు గురువారం తనిఖీ చేశారు. కొలతల ప్రకారం పెట్రోలు పడుతున్నారా.. లేదా అని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన ఇంధనాన్ని అందించాలని, వారి అనుమానాలను నివృత్తి చేయుటకు ఐదు లీటర్ల క్యాన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన



సీతారామపురం : ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ అధికారిణి డాక్టర్ దివ్య అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో వైద్యఆరోగ్య సిబ్బందికి ఫ్లోరోసిస్‌పై బుధవారం ఆమె అవగాహన కల్పించారు. మండలంలో ఫ్లోరైడ్ ప్రభావం ఎక్కువ ఉన్నందున ప్రతిఒక్కరూ మినరల్ వాటర్‌ను తాగేలా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు దంత పరీక్షలు చేయాలన్నారు. ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న పిల్లలకు ప్రతి గురువారం ఐరన్ ఫోలిక్, విటమిన్-సీ మాత్రలు ఇవ్వాలన్నారు. ప్రతిరోజు పాలు, జామకాయలు, పండ్లు తినడం వల్ల ఫ్లోరోసిస్‌ను నివారించవచ్చన్నారు. అనంతరం బాలాయపల్లి, బసినేనిపల్లి, రంగనాయుడుపల్లి పాఠశాలల్లోని విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వప్న, సాయినిఖిల్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



ఆత్మకూరు: డీఎస్సీ-2003 ద్వారా ఉపాధ్యాయులుగా నియామకం పొందిన వారికి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజగోపాలచార్యులు, ప్రధానకార్యదర్శి పీ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం వారు ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 57 ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలోని ముగ్గురు ఐఏఎస్ అధికారులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో సీపీఎస్ అమల్లోకి వచ్చిన 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందే విడుదలైన నోటిఫికేషన్ ద్వారా 2003లో డీఎస్సీ రాసి ఉపాధ్యాయులుగా నియమితులైన వారికి పాత పెన్షన్‌ను అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా దాటవేత ధోరణితో వ్యవహరిస్తుందని మండిపడ్డారు. పాత పెన్షన్ అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట శుక్రవారం నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలి

ఆత్మకూరు: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న దృష్ట్యా పట్టణంలో చెత్త సేకరించే క్రమంలో మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కమిషనర్ గంగాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించడం కొంత ఆలస్యం కావచ్చునని, మీ ఇళ్ల వద్దకు వాహనం వచ్చినప్పుడు చెత్తను అందజేయాలని, రోడ్లపై, కాలువల్లో చెత్త వేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

యూరియా కోసం అన్నదాతల తిప్పలు

- నియోజకవర్గంలో 31వేల ఎకరాలకుపైగా రెండో పంట సాగు
- రైతుసేవా కేంద్రాల ద్వారా సరఫరా నిలిపివేత
- బయట బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయం
- సొసైటీల్లో వద్ద పడిగాపులు పడుతున్న రైతులు



బుధవారం ఆత్మకూరులోని సొసైటీ వద్ద యూరియా నమోదుకు ఎగబడుతున్న రైతులు

ఆత్మకూరు: యూరియా కోసం అన్నదాతలు నానా అగచాట్లు పడుతున్నారు. గత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇంటి ముంగిటకే ఎరువులను సరఫరా చేయడంతో అన్నదాతలకు తిప్పలు తప్పాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతుభరోసా(రైతుసేవా) కేంద్రాలను నిర్వీర్యం చేసింది. వాటి ద్వారా ఎరువుల సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. సొసైటీల ద్వారా అరకొరగా పంపిణీ చేస్తుండడంతో రైతులు పనులు మానుకుని వాటి వద్ద పడిగాపులు కాయాల్సి న పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు నియోజకవర్గంలో అధికారిక లెక్కల ప్రకారం 31వేల ఎకరాలకుపైగా రెండో పంటను సాగుచేస్తున్నారు. వ్యవసాయాధికారుల అంచనాల మేరకు ఎకరాకు మూడు బస్తాల యూరియాను వివిధ దశల్లో వాడాల్సి ఉంటుంది. ఆ మేరకు 93వేల బస్తాల యూరియా అవసరం కాగా, లక్ష బస్తాల యూరియాను ఇండెంట్ పెట్టినట్లుగా వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే కొందరు రైతులు పరిమితికి మించి వినియోగిస్తుండడంతో యూరియాకు డిమాండ్ ఏర్పడినట్లుగా వారు పేర్కొంటున్నారు.

వీపీఏల బదిలీలతో..

ఆత్మకూరు నియోజకవర్గంలో 93 రైతుసేవా కేంద్రాలు ఉండగా, వాటి ద్వారా యూరియా పంపిణీ కోసం వీపీఏలు మొబైల్ యాప్ ద్వారా రైతులను నమోదు చేశారు. అయితే వీపీఏల బదిలీలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో బదిలీ అయిన వీపీఏలు వచ్చి తమకు యూరియాను ఇప్పించి వెళ్లాలని రైతులు వేడుకుంటున్నారు. పాత వీపీఏల లాగిన్లు మార్చి ఉంటే కొత్తగా వచ్చిన వారు నమోదు చేసుకున్న రైతులకు యూరియాను ఇచ్చేందుకు వీలు కలుగుతుంది. కానీ అలా జరగకపోవడంతో కొన్ని రైతుసేవా కేంద్రాలకు యూరియా వచ్చినా కూడా రైతులకు అందజేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఎరువుల పంపిణీకి ఈపోస్ మెషీన్లు అవసరం కాగా రైతుసేవా కేంద్రాల్లో అవి కూడా లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు డైరెక్ట్ బెనిఫిషర్ టు ట్రాన్స్‌పరెన్స్ (డీబీటీ) అమలు చేయడం కూడా సర్వర్లు పనిచేయక కష్టతరంగా మారింది. దీంతో రైతులు యూరియా కోసం సొసైటీలు, ప్రైవేట్ దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. యూరియాకు డిమాండ్ ఏర్పడడంతో ప్రైవేట్ దుకాణాల్లో బ్లాక్‌లో బస్తాను రూ.380 నుంచి రూ.420 వరకు విక్రయిస్తున్నారు. దీనికితోడు కాంప్లెక్స్ ఎరువులు లేదా పురుగు మందులు కొనుగోలు చేయాలని మెలిక పెడుతూ దోచుకుంటుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు మానుకుని సొసైటీల వద్ద క్యూలైన్లలో రోజుల తరబడి పడిగాపులు కాయలేక బస్తాకు రూ.150 నుంచి రూ.200 వరకు అధికంగా చెల్లించి కొనుగోలు చేస్తున్నామని వాపోతున్నారు.

కట్టించుకున్న నగదు వాపసు

ఇటీవల చేజర్ల మండలంలో ఎడగారు సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు ఒక బస్తా యూరియా చొప్పున అందజేసేలా వ్యవసాయాధికారిణి నగదు కట్టించుకున్నారు. అయితే బుధవారం మధ్యాహ్నం యూరియా రాలేదని త్వరలో సొసైటీ వద్దకు వచ్చి తీసుకోవాలని చెప్పి ముందుగా కట్టించుకున్న నగదును రైతులకు వాపస్ చేశారు. ఇన్ని రోజులు కాచుకొని ఉంటే తీరా ఇలా నగదును తిరిగి ఇవ్వడమేమిటని రైతులు ప్రశ్నించారు.

డీసీపల్లి వెళ్లి తెచ్చుకున్నా



ఐదెకరాల్లో రెండో పంట సాగుచేశా. చేజర్లలో యూరియా దొరకడం లేదు. బ్లాక్‌లో అధిక ధర చెబుతుండడంతో కొనలేక డీసీపల్లిలో బస్తాకు కొంత ధర తగ్గిస్తున్నారని తెలుసుకుని వెళ్లి తెచ్చుకున్నా. వరి పైరు బాగా పండాలంటే యూరియా అవసరం. అందుకే దూరమైనా వెళ్లి తెచ్చుకున్నా.

– పెంచలరెడ్డి, మడపల్లి, చేజర్ల మండలం

సొసైటీని మూసేశారు



చేజర్ల సొసైటీలోని ఇద్దరు సిబ్బంది ఉద్యోగ విరమణ పొందారు. పాలకవర్గం కాల పరిమితి కూడా అయిపోవడంతో సొసైటీ మూతపడింది. ఈ ఏడాది రైతుసేవా కేంద్రాల్లోనూ ఎరువులు ఇవ్వడం లేదు. రెండు రోజుల క్రితం వ్యవసాయాధికారులు రైతులకు ఒక్కొక్క బస్తా చొప్పున యూరియా ఇస్తామని డబ్బులు కట్టించుకుని చేతులెత్తేశారు. రైతులకు తిరిగి నగదు ఇచ్చేశారు. ఇలా అయితే రైతులు పంటలు ఎలా పండించుకోవాలి.

–చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, జీఎంఎఫ్ చానల్ మాజీ చైర్మన్, చేజర్ల

అభివృద్ధి..అవినీతిపై చర్చకు సిద్ధం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎం వీరరఘు

చిట్టగుంట: వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధితో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులు సాగిస్తున్న అవినీతిపై కూడా చర్చకు సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు అన్నారు. బోగోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బాబు ష్యూరిటీ...మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామనే భయంతో టీడీపీ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామానికి మంచి జరిగిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదిలోపే మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలతో పాటు కొత్త పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. కోవిడ్ కారణంగా రెండేళ్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారినా ఒక్క పథకంలో కూడా కోతలు విధించలేదన్నారు. ఈ విషయాన్ని గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీ నాయకులే ఒప్పుకున్నారని గుర్తుచేశారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబునాయుడు ఏడాది గడిచినా సూపర్‌సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారని విమర్శించారు. ప్రస్తుతం యూరియా దొరక్క రైతులు బ్లాక్‌లో బస్తాకు రూ.360 నుంచి రూ.370 వంతున చెల్లించి కొనుగోలు చేస్తూ నానా పాట్లు పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా యూరియాతో పాటు ఇతర ఎరువులను గ్రామాల్లోనే అందజేసేవారని గుర్తుచేశారు.

టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే గ్రావెల్ దందా

మండలంలో టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే గ్రావెల్ దందా జోరుగా సాగుతోందని మద్దిబోయిన రఘు ఆరోపించారు. అల్లిమడుగుసంగం నుంచి పట్టపగలు, కడనూతల చెరువు, అటవీ భూముల నుంచి రాత్రి వేళల్లో టిప్పర్లతో భారీగా గ్రావెల్‌ను తరలిస్తున్నారన్నారు. బోగోలు చెరువు నుంచి టీడీపీ నాయకులు ఎన్ని లేఅవుట్లకు గ్రావెల్‌ను తోలారనే విషయం అందరికీ తెలుసన్నారు. గ్రావెల్ నుంచి సచివాలయ ఉద్యోగుల బదిలీల వరకు అంతులేని అవినీతి, అరాచకంతో వ్యవహరిస్తున్న టీడీపీ నాయకులు మీడియా సమావేశాలు పెట్టి జగన్ పాలనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల పరిధిలో ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అర్థం లేని ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. పార్టీ నాయకులు మేకల శ్రీనివాసులు, పచ్చి అంకులయ్య, సుందర్ రాజు, కళ్యాణ్ కుమార్, పాపన మల్లా రెడ్డి, రావి వినోద్, కనిగంటి సునీల్, షేక్ నాయబ్ రసూల్, సూరపనేని శ్రీనివాసులు, గోపిశెట్టి వెంకయ్య, తోటపల్లి సాగర్, గంగపట్ల పాపయ్య, సుధాకర్, దేవరకొండ వరుణ్, బిజ్జం రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్రాధ్యక్షుడి ఎన్నికపై హర్షం

సీతారామపురం : జన విజ్ఞాన వేదిక రాష్ట్రాధ్యక్షుడిగా కుమ్మిత శ్రీనివాసులురెడ్డి ఎన్నికవడంపై మండల జేవీవీ అధ్యక్షుడు టీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి చలపతి, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు బసిరెడ్డి శ్రీనివాసులురెడ్డి గురువారం ఓ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో పనిచేసిన డాక్టర్ సుధాకర్‌రెడ్డి, చక్రపాణి, గీతాంజలి, శేషారెడ్డి, శివపార్వతి,వేణుగోపాల్, బాలకోటేశ్వరరావు, గౌస్‌బాషాకు రాష్ట్ర కమిటీలో కీలక బాధ్యతలు అప్పగించడం శుభపరిణామమన్నారు.

బీఎల్వోలకు శిక్షణ

ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామమోహన్ మాట్లాడుతూ ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు. మృతి చెందిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి చొరవచూపాలి

ఆత్మకూరురూరల్: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా ప్రగతిని అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఎంపీడీఓ రఫీఖాన్, తహసీల్దార్ పద్మజాకుమారి, వైస్‌ఎంపీపీ ఉద్దాల పెంచలరావు, కంభంశెట్టి ప్రమీల, జెడ్పీటీసీ ప్రసన్న, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఉదయగిరి/ఆత్మకూరురూరల్: ఉదయగిరి, వింజమూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఉదయగిరిలోని స్త్రీశక్తి భవనంలో రీజనల్ టెక్నికల్ అధికారి సీహెచ్ రవిచంద్ర, వింజమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అడిషనల్ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ మునిరత్నం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఉదయగిరి, వింజమూరు ఏడీఏలు చెన్నారెడ్డి, శేషగిరి, ఏఓలు విజయభాస్కర్, వాసు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరులోని మండల సమాఖ్య భవనలో ఇన్‌చార్జి ఏడీఏ శైలజాకుమారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు.

రైతుల శ్రేయష్షుకు అధిక ప్రాధాన్యం



వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న ఈడీ బీ విశ్వశ్రీ

కలిగిరి: పొగాకు రైతుల శ్రేయష్షుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ విశ్వశ్రీ తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. వేలం ప్రక్రియను పరిశీలించి రైతులు, అధికారులు, పొగాకు కంపెనీల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025-26 పంట కాలానికి రైతులు సాగులో నియంత్రణ పాటించకుంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పొగాకు బోర్డు అనుమతించిన మేరకు మాత్రమే పొగాకు పంటను సాగు చేయాలన్నారు. అధికంగా, అనధికారికంగా సాగు చేయవద్దని సూచించారు. అధిక ధరలకు బ్యారెన్లు, పొలాలను కౌలుకు తీసుకుని సాగుచేయవద్దన్నారు. వ్యాపారులు తక్కువ గ్రేడు పొగాకుకు కూడా లాభదాయకమైన ధరలు ఇవ్వడంతో పాటు బిడ్‌లు లేని శాతాన్ని తగ్గించాలన్నారు. రైతుల విశ్రాంత గదుల్లో మెరుగైన వసతులు కల్పించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆమె వెంట రీజనల్ మేనేజర్ రామారావు, ఆక్షన్ మేనేజర్ రామాంజనేయులు, వేలం నిర్వహణాధికారి శివకుమార్, పొగాకుబోర్డు అధికారులు, రైతులు ఉన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.199

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం కిలో పొగాకుకు సగటున రూ.199 ధర లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 575 బేళ్లను తీసుకురాగా, 411 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.199.97 ధర లభించిందని వివరించారు.

పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

కొండాపురం(ఉదయగిరి): పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొండాపురం మండలం సాయిపేటలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కలిగిరి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన చెరుకూరి రామాంజనేయులు (42)కు కొండాపురం మండలం సాయిపేటకు చెందిన రాజేశ్వరితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తతో విభేదాలు రావడంతో రాజేశ్వరి 8 ఏళ్లుగా సాయిపేటలోని తన తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. అప్పుడప్పుడు రామాంజనేయులు భార్య వద్దకు వచ్చి గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం సాయిపేటకు వచ్చిన రామాంజనేయులు భార్యతో గొడవకు దిగగా ఇలాగైతే ఇక్కడ ఉండొద్దని ఆమె మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన రామాంజనేయుడు గురువారం గడ్డిమందు తాగాడు. స్థానికులు గమనించి తొలుత కొండాపురం, అనంతరం కావలిలోని ఆస్పత్రులకు తరలించారు. అనంతరం నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ రామాంజనేయులు మృతి చెందారు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కొండాపురం ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమ్మె చేపడుతున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది వారం రోజులుగా సమ్మె చేపడుతున్న విషయం తెలిసిందే. వారికి మద్దతుగా పారిశుధ్య కార్మికులు సైతం గురువారం నుంచి సమ్మెకు దిగారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉదయం 5.30 గంటల నుంచి సమ్మెకు కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల జీతాలను పెంచడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల ఉద్యోగ విరమణ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు శివప్రసాద్, ఆత్మకూరు శాఖ కార్యవర్గ సభ్యులు కొండమూరి హజరత్తయ్య, ఏ నాగయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి కే డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసులు పరిష్కారం



ర్యాలీని ప్రారంభిస్తున్న జడ్జి బీ గాయత్రి

ఆత్మకూరు: మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవచ్చని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బీ గాయత్రి అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం-దేశం కోసంపై అవగాహన ర్యాలీని పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టు నుంచి ఆర్టీసీ డిపో వరకు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కోర్టుల్లో కేసులు అనేక కారణాలతో ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయన్నారు. వాటిని త్వరగా పరిష్కరించి కక్షిదారులకు సమయం, నగదు వృథాను అరికట్టేందుకు మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగకరమన్నారు. వివాహాలు, వాహనాల ప్రమాదాలు, బీమా, బ్యాంకు వివాదాలకు సంబంధించి కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రసూల్, కేవీ శేషారెడ్డి, ఎస్‌కే నజీర్, తిరుపతమ్మ, మధు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద చెరువును పరిశీలించిన జేసీ



రైతులతో మాట్లాడుతున్న జేసీ కార్తీక్

సోమశిల: అనంతసాగరం మండలం దేవరాయపల్లి బిట్-1 పంచాయితీ పరిధిలోని ముత్తుకూరులోని వివాదాస్పద ఊట చెరువును జాయింట్ కలెక్టర్ కార్తీక్ గురువారం పరిశీలించారు. ఊట చెరువు విషయంలో గ్రామస్తులు, అందులో పట్టాలు పొందిన వారి నడుమ కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ విషయమై గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఊటచెరువు 12.98సెంట్లు ఉండగా, దానిని కొందరు ఆక్రమించి పూడ్చివేయడంతో మూగజీవాలకు తాగునీటి సమస్య నెలకొంటోందని విన్నవించారు. దీంతో జేసీ క్షేత్రస్థాయిలో చెరువు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఊటచెరువులోని సర్వేనంబర్లలో కొందరు వ్యక్తులు పట్టాలు పొంది ఉన్నారని, దీనిపై విచారించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ప్రభుత్వం అనుమతించిన తర్వాత భూమిని సేకరించి చెరువును యధాతదంగా గ్రామస్తులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఇరువురి మధ్యన వివాదాలు చెలరేగుతున్నందున చెరువులో ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆత్మకూరు ఆర్డీఓ పావని, తహసీల్దార్ జయవర్ధన్, ఇరిగేషన్ ఏఈ ఖాదర్, తదితరులు ఉన్నారు.

వైభవంగా వెంగమాంబ నెలపొంగళ్లు



వెంగమాంబకు సమర్పించేందుకు సారెను తీసుకొస్తున్న భక్తులు

దుత్తలూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు ఆలయంలో నెల పొంగళ్ల కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ముగిసి నెల రోజులు పూర్తయిన సందర్భంగా వెంగమాంబ-గురవయ్య దంపతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. హోమగుండంలో ఎండుకొబ్బరి వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు ఊరేగింపుగా సారెను తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. దుత్తలూరుకు చెందిన భజన బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



విశేషాలంకారంలో వెంగమాంబ దంపతులు



పొంగళ్లు పెడుతున్న మహిళలు



కోలాట ప్రదర్శన

సోమశిల ఆప్రాన్ పనులు పూర్తి చేయాలి



జలాశయాన్ని పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

సోమశిల: సోమశిల జలాశయానికి సంబంధించిన నిలిచిపోయిన ఆప్రాన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర కౌలురైతు సంఘం కార్యదర్శి హరిబాబు కోరారు. గురువారం సోమశిల ప్రాజెక్ట్‌ను రాష్ట్ర కౌలు రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ సోమశిల జలాశయం ప్రమాదపు అంచుల్లో ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు జలాశయాన్ని సందర్శించి దెబ్బతిన్న ఆప్రాన్‌ను పరిశీలించి ఆరవై రోజుల్లో పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు పనులు పూర్తి చేయలేదన్నారు. జిల్లాకు వరప్రదాయిని అయిన సోమశిల ప్రాజెక్టు పనులను గాలికి వదిలేయడం జిల్లా రైతాంగాన్ని, ప్రజలను మోసం చేయడమేనన్నారు. జలాశయం వద్ద సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నదని వెంటనే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. జలాశయంపై నివేదికను ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రికి అందజేస్తామని తెలిపారు. సీపీఎం రైతు సంఘం రాష్ట్ర నాయకులు బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య,కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గురునాథం, సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా పాల్గొన్నారు.